క్లుప్తంగా

ఫ్యామిలీ ఫిజీషియన్ తనిఖీ


కాపవరంలో ఫ్యామిలీ ఫిజిషియన్ తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: సుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు మందులు సక్రమంగా వాడాలని, లేనిపక్షంలో తదుపరి వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు హెచ్చరించారు. పాలకొల్లు మండలం కాపవరంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. గర్భిణులను నెలవారీ పరీక్షలు ఫ్యామిలీ డాక్టర్ వద్ద పరీక్షలు చేయించాలని కోరారు. అనంతరం చింతపర్రులో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా. అడ్డాల ప్రతాప్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీ విజయ ల్యాబ్‌కు గుర్తింపు అభినందనీయం


ల్యాబ్ 25 వసంతాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు లోని శ్రీ విజయ డయాగ్నస్టిక్ ల్యాబ్ కు జాతీయస్థాయిలో ఎన్‌ఏబీఎల్ అక్రిడేట్ గుర్తింపు రావడం అభినందనీయమని పాలకొల్లు చాంబర్ అధ్యక్షుడు కేవీఆర్ నరసింహారావు, ప్రముఖ ఆడిటర్, ఛాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి కె.రామరాజు అన్నారు. బుధవారం పాలకొల్లులోని విజయ ల్యాబ్‌లో 25 వసంతాల బ్రోచర్ ఆవిష్కరించారు. అలాగే ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ సారథ్యంలో న్యూ బ్రోచర్‌ను నరసింహారావు, న్యూ రిపోర్టింగ్ ఫార్మాట్‌ను రామరాజు, న్యూ ఫార్మాట్ కవర్స్‌ను ప్రముఖులు యినుకొండ రంగారావులు ఆవిష్కరించారు. ల్యాబ్ లో ప్యాథాలజీ సేవలతో పాటు ఆధునిక వైద్య పరీక్షల పరికరాలు అందుబాటులో ఉండడం హర్షణీయమని వక్తలు అన్నారు. ఈ సందర్భంగా నరసింహారావు, రామరాజు, రంగారావు లను మురళీకృష్ణ శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధి రేపాక కిరణ్ భాను తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం

భీమవరం ప్రకాశం చౌక్: భీమవరం మావుళ్లమ్మ అమ్మవారి నిత్యాన్నదానానికి దాత రూ.లక్ష విరాళం అందజేశారు. భీమవరం గొల్లవానితిప్పకు చెందిన రాయుడు శ్రీరామమూర్తి ఈఓ యర్రంశెట్టి భద్రాజీకి విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆలయ ముఖ్య అర్చకులు మద్దిరాల రమణశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఫొటో, ప్రసాదాలు అందజేశారు.

అక్రమ కేసును ఉపసంహరించుకోవాలి

వీరవాసరం: నవుడూరు గ్రామ ఉప సర్పంచ్ బొట్టా మునేంద్రరావుపై సర్పంచ్ నల్లమల్లి వేణుక పెట్టిన అక్రమ కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్, ఎస్సీ సంఘం నాయకులు నేతల జ్ఞాన సుందర రాజు కోరారు. నవుడూరు గ్రామ సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పంచాయతీ బోర్డు సమావేశంలో మునీంద్ర అవమానించారంటూ సర్పంచ్ చేసిన ఫిర్యాదు వాస్తవం కాదని బోర్డు సభ్యులంతా ఏకగ్రీవంగా తెలిపారన్నారు. ఎస్సీ, బీసీ వర్గాలు సోదర భావంతో ఉన్న తరుణంలో వర్గ విభేదాలు సృష్టిస్తూ కేసులు పెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. అక్రమ కేసులను తొలగించాలంటూ గ్రామస్తులు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. సమావేశంలో మానుకొండ ప్రదీప్ కుమార్, వీరవాసరం సర్పంచ్ చికిలే మంగతాయారు, గడ్డం భాస్కరరావు, బొంతు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందాం

ఆకివీడు: ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందామని డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.ధనుష్ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త బంద్ సందర్భంగా స్థానిక పాఠశాలల్ని, కాలేజీల్ని బుధవారం మూయించివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్ని నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.రాంబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలుపుదల చేసి, కడప ఉక్కు కర్మాగారం వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. బంద్‌లో నాయకులు మోహన్, కృష్ణ, సాయి ఫణి, వెంకటేష్, గణేష్, భరత్, ఠాగూర్, హేమంత్ విద్యార్థి యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాధికార ప్రభంజనం

- జనంతో కిటకిటలాడిన క్షీరపురి
- సామాజిక సాధికార బస్సుయాత్రకు అనూహ్య స్పందన


సామాజిక సాధికార యాత్రలో యువకుల కోలాహలం


సామాజిక సాధికార యాత్రలో పాల్గొన్న యువత, మహిళలు

పాలకొల్లు అర్బన్: ఒక్క అవకాశం ఇవ్వండి.. సేవ చేసుకుంటా.. జీవితాంతం రుణపడి ఉంటానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సామాజిక సాధికార బస్సుయాత్రకు హాజరైన జన సమూహాన్ని కోరడంతో ప్రజలు చప్పట్లు కొట్టి స్పందన తెలియజేశారు. పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌లో బుధవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు పాలకొల్లు పట్టణం, మండలం, పోడూరు, యలమంచిలి మండాలల నుంచి విశేష సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో గుడాల గోపి ధన్యవాదాలు తెలిపారు. పాలకొల్లులో ఏ వీధి చూసినా జనంతో నిండిపోయారన్నారు. తనపై ఎంతో ప్రేమ చూపించి తరలి వచ్చిన ప్రతీ ఒక్కరికీ పాదాభివందనాలు తెలిపారు. సామాజిక సాధికార బస్సు యాత్ర కోసం అహర్నిసలు శ్రమించిన నాయకులు, కార్యకర్తలందరికీ పేరుపేరునా ధన్యవాదలు తెలిపారు.జెడ్పీటీసీ సభ్యులు నడపన గోవిందరాజుల నాయుడు, గుంటూరు పెద్దిరాజు, ఎంపీపీలు చిట్టూరి కనకలక్ష్మి, సబ్బితి సుమంగళి, రావూరి వెంకటరమణ, పార్టీ మండలాల కన్వీనర్లు విప్పర్తి ప్రభాకరారవు, చందక సత్తిబాబు, పాత్తూరి బుచ్చిరాజు, పితాని చిన్న, గవర, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లు బొడ్డేటి సూర్యనారాయణ, పెదపాటి పెద్దిరాజు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, మహిళా నాయకులు కర్రా జయసరిత, మద్దా చంద్రకళ, వార్డు ఇన్‌చార్జ్‌లు, గ్రామ పార్టీ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద బస్సుకి పూజలు

పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకస్వామి అనిల్‌కుమార్ బ్రహ్మత్వంలో యాత్ర కోసం వినియోగించే బస్సుకి పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), పార్టీ చింతలపూడి పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, గుడాల సాయిబాలాజీలకు ఆలయం


సామాజిక సాధికార యాత్రలో ప్రజలకు నమస్కరిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు

తరపున చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు.

ఆకట్టుకున్న ర్యాలీ

పట్టణంలోని బ్రాడీపేట బైపాస్‌రోడ్డులోని రామచంద్ర గార్డెన్స్ నుంచి బస్సు యాత్ర ప్రారంభించారు. బస్సుకి ముందు భాగంలో వందలాది మంది యువకులు భారీ మోటార్ సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. బస్సుపైన నియోజవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి


సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభ వేదికపై మంత్రి వేణుగోపాలకృష్ణ, ముఖ్య నాయకులు


సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభ వేదికపై వైఎస్సార్ సీపీ నేతల ఉత్సాహం

గోపాలరావు (గోపి), మంత్రులు చెల్లబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్, బాపట్ల ఎంపీ నందిగాం సురేష్, టీటీడీ మెంబర్ మేకా శేషుబాబు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయ వర్మ తదితరులు వేదిక వద్దకు తరలి వచ్చారు. దారిపొడవునా మహిళలు,యువజనులు బస్సుయాత్రకు స్వాగతం పలికారు. జై జగన్, జైజై గుడాల గోపి అంటూ నినాదాలు చేశారు. అలాగే పాలకొల్లు మండలం నుంచి పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు , యలమంచిలి మండలం నుంచి పార్టీ కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు నాయకులు, కార్యకర్తలతో వందలాది మోటార్ సైకిళ్లతో ర్యాలీగా సభా స్థలికి తరలి వచ్చారు.

దారులన్నీ పాలకొల్లువైపే

పోడూరు: పాలకొల్లులో బుధవారం జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్ర బహిరంగ సభకు పోడూరు మండలంలో పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని 8 గ్రామాల నుంచి మహిళలు, యువత, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీసంఖ్యలో తరలి వెళ్లారు. వద్దిపర్రు, రావిపాడు, పెనుమదం, అప్పన్న చెరువు, మట్టపర్రు, జిన్నూరు, వేడంగి, కొమ్ముచిక్కాల గ్రామాల నుంచి దాదాపు 60 బస్సుల్లో జనం బహిరంగ సభకు వెళ్లారు. జెడ్పీటీసీ సభ్యులు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, మండల ఇన్‌చార్జి పితాని సత్యనారాయణ(చిన్న), ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, సొసైటీ చైర్మన్‌లు డీటీడీసీ బాబు, కొర్రపాటి వీరాస్వామి, జేసీఎస్ కన్వీనర్ బళ్ల రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కొండేటి రవి తదితరులు బహిరంగ సభకు తరలివెళ్లిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.


పాలకొల్లు అర్బన్: శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద బస్సుకి పూజలు చేస్తున్న దృశ్యం


సామాజిక సాధికార యాత్రలో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన


పోడూరు: జిన్నూరు నుంచి బస్సు యాత్రకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'


పిల్లి నాగన్న

పోడూరు: మండలంలో ఆచంట నియోజకవర్గం పరిధిలోని 8 గ్రామాల్లో ఈ నెల 9 నుంచి షెడ్యూల్ వారీగా గ్రామ సచివాలయాల పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లి నాగన్న తెలిపారు. పోడూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమ వివరాలను తెలిపారు. 9న పోడూరు-1, 10న పోడూరు-2, 14న కవిటం-1, 15న కవిటం-2, 16న జగన్నాథపురం, 20న గుమ్మలూరు-1, 21న గుమ్మలూరు-2, 22న తూర్పుపాలెం సచివాలయాల పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్..' కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ, వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం, గ్రామపెద్దలతో సచివాలయం పరిధిలో రాత్రి బస, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ నాగన్న పిలుపునిచ్చారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ ప్రశాంతి


నరసాపురంలో సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై ముందస్తుగా ప్రణాళికలు తయారు చేస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం నరసాపురంలో ఎన్నికల సామగ్రి భద్రపరిచే గదులు, ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే ప్రదేశాలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి అనువైన ప్రాంతాలను ఆమె నరసాపురంలోని వైఎన్ కళాశాలలో గదులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత అనుభవాల దృష్ట్యా ఎన్నికల సంఘం సూచనల మేరకు ముందస్తుగా సన్నద్ధమవుతున్నామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామన్నారు. ముఖ్యంగా భద్రత, పారిశుద్ధ్యం, విద్యుత్ సదుపాయం ఉన్న ప్రాంతాలను ఎన్నికల నిర్వహణ కేంద్రాలుగా ఎంపిక చేయాల్సి ఉందన్నారు. వైఎన్ కళాశాల పూర్తి అనుకూలంగా ఉందన్నారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ ఎం.రామసుందర్‌రెడ్డి, నరసాపురం ఆర్డీఓ ఎం.అత్యుత్ అంబరీష్, తహసీల్దార్ ఎండీ ఫాజిల్ ఆమె వెంట ఉన్నారు.

జాతీయ విద్యావిధానంతో నైపుణ్యాభివృద్ధి


ఆచార్య, డీన్ కె.రమేష్‌ను సత్కరిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కేఆర్ రాజు

పెనుగొండ: భారత జాతీయ విద్యా విధానంతో విద్యార్థి బహుళ విభాగ విద్యను అభ్యసించడంతో పాటు, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవచ్చునని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ఇంగ్లిష్ ఆచార్యులు, డీన్ కె.రమేష్ అన్నారు. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో అధ్యాపకుల సామర్థ్య నిర్మాణ అవగాహనసదస్సులో పాల్గొన్నారు. భారత ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020 ప్రవేశపెట్టిందన్నారు. దీని వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. సబ్జెక్టుల ఎంపిక, ప్రశ్నా పత్రాలు, మూల్యాంకనం, మార్కుల కేటాయింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

పెనుగొండ: విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ, కడప పరిశ్రమ నిర్మాణం కోసం విద్య సంస్థల బంద్ విజయవంతమైంది. బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి విద్యా సంస్థలను మూసివేయించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కె.ఈశ్వర్ కుమార్, పట్టణ అధ్యక్షుడు సాయి, నాయకులు చక్రి, నాని, మణికంఠ, జగదీష్, ఓం సాయి, కార్తీక్, ఇమ్మానుయేల్, రవి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


వైఎస్సార్ రైతు భరోసా నమూనా చెక్కును రైతులకు అందజేస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: రైతు సంక్షమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్రప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం2 రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం నరసాపురం నియోజకవర్గస్థాయిలో జరిగిన రెండో విడత రైతు భరోసా పీఎం కిసాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలో 13319 మంది రైతులకు రూ.5.33 కోట్లు రైతు భరోసా పీఎం కిసాన్ నమూనా చెక్కును రైతులకు అందించారు. తొలుత నరసాపురం, మొగల్తూరు మండలాలకు చెందిన 20 రైతు భరోసా కేంద్రాల్లోని 20 గ్రూపులకు రూ.1.95 కోట్ల విలువ కలిగిన 57 వ్యవసాయ పరికరాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నాడు సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరిగిన బహిరంగ సభ నుంచి వైఎస్సార్ రైతు భరోసా రెండో విడత నిధులను విడుదల చేశారన్నారు. నరసాపురం నియోజకవర్గంలో రెండో విడత ప్రతి రైతుకి రూ.4 వేలు చొప్పున రూ.5.33 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు వేశామన్నారు. ఆపదలో ఉన్నప్పుడు రైతులను ఆదుకోవాలని ప్రభుత్వ ఉద్దేశమని ఆయన అన్నారు. ఏ ఇబ్బంది వచ్చినా రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన చెప్పారు. రొయ్య, చేపలు సాగు చేసే రైతులకు యూనిట్‌కు రూ.1.50లకు కరెంటు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ విధంగా ఇప్పటి వరకూ రూ.75.30 కోట్లు రైతులకు లబ్ధి జరిగిందన్నారు. కౌలు రైతుల పెట్టుబడి సాయాన్ని వినియోగించుకుని ఆర్థికంగా లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వర్లు, ఏడీఏ ఈదా అనిల్‌కుమారి, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాబ్జి, ఎంపీపీ మైలాబత్తుల సోని, ఆత్మా చైర్మన్ కడలి రాంబాబు, సర్పంచ్ తిరుమాని వెంకట్రాజు, నరసాపురం, మొగల్తూరు మండలాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాంగ్రేగుల నరసింహారావు, కంచర్ల బాబులు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు సంగాని వడ్డికాసులు, సొసైటీ అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చాగంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

నరసాపురం: కార్తీకమాసం పురస్కరించుకుని నరసాపురం బస్టాండ్ నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 19, 26 వచ్చేనెల 3,10 తేదీల్లో పంచారామ క్షేత్రాల్లో దర్శనాలు చేసుకునే విధంగా బస్సులు తిప్పుతున్నామని పేర్కొన్నారు. అలాగే శబరిమల యాత్రికులకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్తీకమాసంలో విహార యాత్రలకు వెళ్లేవారు ఒక గ్రామంలో 40 మంది ఉంటే నేరుగా ఆయా గ్రామాలు బస్సులు పంపిస్తామని చెప్పారు.

నరసాపురంలో భారీ వాన

నరసాపురం రూరల్: వారంరోజులుగా నిత్యం మధ్యాహ్న సమయంలో కురుస్తున్న వర్షాలతో ప్రజ లు ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం నరసాపురం మండలంలోని పలు గ్రామాల్లో నూ, మొగల్తూరులో నూ భారీగా కురవడంతో రోడ్లు, పల్లపు ప్రాంతాల్లోనూ ఎక్కువ సేపు నీరు నిలచి ఉండిపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. మొగల్తూరు లోని ప్రాధాన కూడలి వద్ద, మొగల్తూరు ఉన్నత పాఠశాల ప్రాంతాల్లో నీరు నిలచి పోయింది. జనసంచారం ఎక్కువగా ఉండే కూడళ్ల వద్ద నీరు నిలిచిపోవడంలో ఇబ్బందులకు గురయ్యారు. ఇదిలా ఉంటే కోతకు వచ్చిన వరిచేలు, కూరగాయల రైతులకు ఒక్కసారిగా భారీగా కురిసిన ఈ వర్షం ఆయా పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని వాపోతున్నారు.

విస్సాకోడేరులో రోడ్లు ప్రారంభం

పాలకోడేరు: ముఖ్యమంత్రి జగనన్న పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. ఇటీవల విస్సాకోడేరులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరయిన ఏడు సీసీ రోడ్ల నిర్మాణం కోసం బుధవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా పాలన జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ముఖ్యమంత్రి జగనన్నను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పెన్మత్స శ్రీనివాసరాజు, ఉప సర్పంచ్ కందుల నాగరాజు, దుండి అశోక్ బాబు, పిన్నమరాజు పృథ్వీరాజ్, సాగిరాజు హరివర్మ తదితరులు పాల్గొన్నారు.